క్లుప్తంగా

పరీక్షలంటే భయం వీడాలి



వ్యక్తిత్వ వికాసంపై మాట్లాడుతున్న రిటైర్డ్ కల్నల్ గగరిన్

గుడిబండ: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని రిటైర్డ్ కల్నల్ గగరిన్ అన్నారు. మంగళవారం గుడిబండ మహాత్మా జ్యోతి పూలే బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థినులకు ప్రిన్సిపాల్ ప్రసాద్ అధ్యక్షతన వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒక ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనురాధ, దుర్గా, రాధమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష అందిస్తున్న కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

హిందూపురం: పట్టణంలోని పాండురంగనగర్ అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు అల్పాహార పంపిణీకి వర్షం వల్ల ఆటంకం కలగకుండా షెడ్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తకు ఆ మొత్తాన్ని అందించారు.

ఏపీడీ, సీఓకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీడీ లక్ష్మీనారాయణ, సీఓ హనుమంతరాయప్ప ఉత్తమ సేవలకుగాను రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ చేతన్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మంగళవారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాదర్, ఏపీఓ భార్గవి, టీఏలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మెడికల్ అండ్ రెప్రజెంటేటివ్స్ అసోసియేషన్ సభ్యులు

హిందూపురం: మెడికల్ అండ్ రెప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఎన్నిక పట్టణంలో మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా జి.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడి రామ్మోహన్, హరికృష్ణ, కార్యదర్శిగా రామ్మూర్తి, జాయింట్ సెక్రెటరీగా వసీం, లోకేష్, కోశాధికారిగా మునీర్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు,

అగ్నికి ఆహుతైన దానిమ్మ తోట



కాలిపోయిన దానిమ్మ తోట

పావగడ: తాలూకాలోని మారమ్మనహళ్లికి చెందిన రైతులు రత్నమ్మ, మంజునాథరెడ్డికి చెందిన దానిమ్మ తోట మంగళవారం అగ్నికి ఆహుతైంది. 20 ఎకరాల్లోని 8 వేల దానిమ్మ చెట్లు, 60 కొబ్బరి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే మోటారు పంపు సెట్, కేసింగ్, డ్రిప్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పెనుకొండ రూరల్: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా సోమందేపల్లి మండలానికి చెందిన రామాంజినేయులును మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. 40 హైవార్డ్స్ విస్కీ మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉచిత బస్సు.. అంతా తుస్సు!





- అధికారం చేపట్టగానే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని కూటమి నేతల హామీ
- ఉగాది, దసరా, సంక్రాంతి నుంచి అమలంటూ జోరుగా ప్రచారం
- 8 నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడంపై మహిళల అసహనం
- చంద్రబాబును నమ్మి ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు

అగళి: ఏరు దాటేదాక ఓడ మల్లన్న.. ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్లుంది కూటమి ప్రభుత్వ పాలకుల తీరు. ఎన్నికల సమయంలో సూపర్-6 హామీలంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా హామీలు మాత్రం అమలు చేయడం లేదు. సూపర్-6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అటకెక్కించడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు.

పండుగల ముందు అంటూ ప్రచారం..

అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా ఉచిత బస్సుపై ఏమీ మాట్లాడడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉగాది నుంచి ఉచిత బస్సు, దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ ప్రతి పండుగ ముందు ఉచిత బస్సు ప్రయాణం తెరపైకి తెస్తున్నారు. ప్రభుత్వ పెద్దలతో పాటు కూటమి నాయకులు కూడా ఎన్నో సార్లు ఈ విషయాన్ని ప్రచారం చేశారు. మంత్రి వర్గంలో కూడా చర్చించామంటూ ముచ్చట్లు చెప్పారు. అయితే రోజులు గడచిపోతున్నా హామీని మాత్రం అమలు చేయడం లేదు.

3,49,059 మంది మహిళల ఎదురుచూపు

మడకశిర నియోజకవర్గంలో 1,05,501 మంది, హిందూపురం 1,25,213 మంది, పెనుకొండలో 1,18,345 మంది 18 సంవత్సరం దాటిన మహిళలు ఉన్నారు. ఉచిత బస్సు హామీ అమలు చేస్తే వీరందరికీ లబ్ధి చేకూరనుంది. అయితే ఎన్నికల సమయంలో కేవలం మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేయకుండా జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వం ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని మహిళలు మండిపడుతున్నారు.

మహిళల సంఖ్య ఇలా..

మడకశిర నియోజకవర్గం	1,05,501
హిందూపురం నియోజకవర్గం	1,25,213
పెనుకొండ నియోజకవర్గం	1,18,345

కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ ఇప్పటి వరకూ పట్టాలెక్కలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీనీ అమలు చేశాయి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళలకు కొంత మేర ఊరట కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

– మంజుల, ఎంపీటీసీ సభ్యురాలు

ఇప్పుడు మాట మార్చడం సరికాదు



మడకశిర నియోజకవర్గంలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా? అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి సీఎం పీఠంపై కూర్చున్న తరువాత ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుంది అంటే ఎలా? ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

– గాయత్రి, వైస్ ఎంపీపీ, అగళి మండలం

నమ్మి ఓట్లేస్తే మోసం చేస్తారా?



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు హామీ అమలు చేయ కుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. అదిగో..ఇదిగో అంటున్నారే కానీ ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం సరికాదు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

– విమలమ్మ, పళారం, గుడిబండ మండలం

నేడు వెంకటగిరిపాళ్యంలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ'

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యంలో బుధవారం 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

పదవులకు రాజీనామా చేయండి

రొళ్ల: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదిలోపు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు అండ్‌కో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రస్తుతం ఇవ్వలేమని చేతులెత్తేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన ఒక్క హామీని కూడా సక్రమంగా నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. హామీలను నిలబెట్టుకోవాలని లేకపోతే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధికి రైతులు సహకరించాలి



రైతులతో సమావేశమైన ఆర్డీఓ ఆనంద్‌కుమార్

మడకశిర: మడకశిర పారిశ్రామికవాడ అభివృద్ధికి రైతులు సహకరించాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గౌడనహళ్లి, ఆర్.అనంతపురం గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. పారిశ్రామికవాడ ఏర్పాటుకు రైతుల నుండి భూసేకరణ, భూములకు ధర నిర్ణయంపై ఆయన చర్చించారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ జనరల్ మేనేజర్ సోని, తహసీల్దార్ కరుణాకర్, డీటీ లక్ష్మీనరసింహా, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: మండల కేంద్రంలోని నాల్గవ వార్డులోని పులేరు రోడ్డులో కాపురముంటున్న శ్యామల అనే వివాహిత కుటుంబ కలహాలతో మంగళవారం విషద్రవం సేవించింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను వెంటనే హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దారి కోసం రైతుల నిరసన



కాళేశ్వరస్వామి ఫాం హౌస్ ముందు నిరసనకు దిగిన రైతులు

పెనుకొండ రూరల్: పొలాలకు వెళ్లే దారి కోసం మండలంలోని రాంపురం గ్రామం వద్ద ఉన్న కాళేశ్వర స్వామి ఫాం హౌస్ ముందు వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు మంగళవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాళేశ్వరస్వామి ఫాం హౌస్ వెనుక తమ పొలాలు ఉన్నాయన్నారు. అయితే పొలాల్లోకి వెళ్లనీయకుండా ఫాం హౌస్ సిబ్బంది తమను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గేటుకు తాళాలు వేసేస్తే తామెలా పొలాల్లోకి వెళ్లాలని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇక్కడ ప్రభుత్వ భూమి ఉందని, ఆ దారిని కూడా వారు ఆక్రమించి కంచె వేశారని ఆరోపించారు. ఈ విషయమై మూడు నెలల క్రితం మంత్రి సవితకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని రైతులు ప్రసాద్, శ్రీనివాసులు, సావిత్రమ్మ, రామాంజినేయులు, అంజిన్ప, ఆదిలక్ష్మి, అలివేలమ్మ, చంద్ర, దలవాయి వెంకటలక్ష్మి తదితరులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ వివాదంపై తహసీల్దార్ శ్రీధర్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఇప్పటికే పలుమార్లు ఆ భూమిని సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వాహకులతో కూడా మాట్లాడామన్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ఉదయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో 180 మంది విద్యార్థులు ఉన్నారని, మధ్యాహ్నం భోజనం తిన్న అనంతరం ప్లేట్లు కడుక్కునేందుకు నీటి సౌకర్యం లేదని, అలాగే మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. బైపీసీలో 60 మంది విద్యార్థులు ఉన్నారని అయితే వారికి ఫిజిక్స్ అధ్యాపకుడు లేక వారు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పరీక్షలు సమీపిస్తున్నా అధ్యాపకుడు లేకపోతే పరీక్షలు ఎలా రాయాలి ప్రశ్నించారు.

గోళాపురంలో 'పొలం పిలుస్తోంది'

హిందూపురం: మండలంలోని గోళాపురం, తూమకుంట పంచాయతీ రైతుసేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పలు పొలాలను పరిశీలించి రబీ సీజన్‌లో పంట నమోదు, 80 శాతం సబ్సిడీతో డ్రోన్ పథకం, రాగి పంట సాగు విస్తీర్ణం పెంపు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కందిలో పంట కోత ప్రయోగం నిర్వహించి పంట దిగుబడి అంచనా వేశామన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోందా?

- హామీలు గుప్పించేటప్పుడు తెలీదా..
- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఫైర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రచారం చేసిన ప్రస్తుత సీఎం చంద్రబాబు.. ఇప్పుడు హామీలను అమలు చేయలేమని చేతులెత్తేయడంపై వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు చేయడం చంద్రబాబు చరిత్రలో లేదని మండిపడ్డారు. హామీలు ఇచ్చేటప్పుడు గుర్తురాని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోందా? అని ప్రశ్నించారు. ఎంతమంది పిల్లలు బడికెళ్తే అందరికీ తల్లికి వందనమని.. ఇప్పుడు ఆ పథకానికి దండం పెట్టేశారన్నారు. రైతుకు రూ.20 పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ మూడు సిలిండర్లు, మహిళలకు ప్రతినెలా రూ.1500 నగదు ఇలా హామీలు గుప్పించి.. గెలిచిన తర్వాత ఆర్థిక పరిస్థితి అర్థం కావడంలేదని సీఎం చంద్రబాబు చెబుతుండటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తొమ్మిదేళ్లు పడుతుందని, అందుకని హామీలు ఇవ్వలేమని చెబుతుండటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కరెంటు చార్జీలతో పాటు నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలను నిలువుదోపిడీ చేసి ఆదాయం పెరిగితే సంక్షేమ పథకాలపై ఆలోచిస్తామనడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా కరోనాతో అన్ని రాష్ట్రాలు అల్లాడిపోతున్న సమయంలోనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందేలా చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి జగనన్న అని.. చంద్రబాబువన్నీ డొంక తిరుగుడు మాటలేనని ఎద్దేవా చేశారు.

సంక్షిప్త సమాచారం

గది ఇవ్వాలని వినతి

హిందూపురం టౌన్: స్థానిక కోట ఏరియాలో నిరుపయోగంగా ఉన్న పాత టూటౌన్ పోలీస్‌స్టేషన్ గదిని పేట వెంకటరమణస్వామి తేరు షెడ్ కోసం కేటాయించాలని మంగళవాం ఆలయ తేరు కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

టెండర్ల ఆహ్వానం

పెనుకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని 10 దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసి డిపో మేనేజర్ రామసుబ్బయ్య తెలిపారు. ఫిబ్రవరి 5 వరకూ టెండర్ ఫారాలు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రేపు చేపల చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి గురువారం ఉదయం 10.30 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరియన్న సమక్షంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి టీ రాజేష్ తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

అగళి: ఉత్తమ సేవలకు రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా తహసీల్దార్ సుబ్బరావు, సీనియర్ అసిస్టెంట్ గుర్రన్న ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

పరిగి: వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులను పాటిస్తే తప్పక అధిక దిగుబడులను సాధిస్తారని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. మండలంలోని పైడేటి, విట్టాపల్లి గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల మీట్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురం గంగమ్మదేవి ఆలయ వార్షికోత్సవానికి హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు.. లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రామానందన్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తనవంతుగా రూ.10,116 విరాళంగా అందజేశారు.

విద్యార్థుల శ్రమదానం

పెనుకొండ: విద్యతో పాటు సామాజిక సేవ ఎంతో అవసరమని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు శ్రమదానం చేసి కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు.

కంటి జబ్బులపై నిర్లక్ష్యమొద్దు

పెనుకొండ: కంటి జబ్బులపై నిర్లక్ష్యంగా ఉండకూడదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కళాశాలలో పుట్టపర్తికి చెందిన పీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.

అమృత యోజనతో పట్టణాభివృద్ధి

పావగడ: అమృత యోజనతో పట్టణంలోని 23 వార్డులకు ఇంటింటికీ తాగు నీరు అందించనున్నట్లు మున్సిపల్ అధ్యక్షుడు పీహెచ్ రాజేశ్ తెలిపారు. పైప్‌లైన్ పనులు కూడా ప్రారంభించామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో నిర్వహించారు. 22, 23 వార్డుల్లో విద్యుత్ స్తంభాలు, పట్టణంలోని కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సభ ఆమోదించింది. శని మహాత్మ ఆలయం ఎదుట, కర్ణాటక బ్యాంకు పక్కన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమోద ముద్ర వేశారు.

విద్యుత్ సమస్యలపై రైతుల పోరుబాట



రొళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు



అగళి మండలం మధూడి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రొళ్ల/అగళి: విద్యుత్ సమస్యలపై రైతులు పోరుబాట పట్టారు. రొళ్లలోని 33 కేవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను హొట్టేబెట్ట పంచాయతీ పరిధిలోని కొత్తపాళ్యం, కల్లురొప్పం, హొట్టేబెట్ట, కేపీ తండా తదితర గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం ముట్టడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోజూ 9 గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫర చేస్తామని చెప్పి మోసగించారని విమర్శించారు. రోజూ రెండు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలంటూ అగళి మండల పరిధిలోని మాధుడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు మంగళవారం ధర్నాకు దిగారు. లో ఓల్టేజీ సమస్యతో పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు లోకేష్, వేంకటరమణరెడ్డి, శ్రీనివాస్, పుట్టరాజు, చంద్రశేఖర్, చంద్రప్ప, ముద్దప్ప, రాజప్ప, బసవరాజు వాపోయారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220717, 9912220723, 9912220726